క్లుప్తంగా

వరి పొలాల పరిశీలన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలోని వరి పొలాలను బుధవారం జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎం.హైమావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ వరి పైరు 15 నుంచి 20 రోజుల దశలో ఉందని, రైతులు భూసార పరీక్ష ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని సూచించారు. ఆఖరు దుక్కిలో గానీ, విత్తనాలు నాటిన 20 రోజులలోపు కానీ భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వాడాలని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి ఎం.శిరీష, గ్రామ వ్యవసాయ అధికారులు ఎస్.మల్లికార్జునరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కేఎల్‌యూ విద్యార్థులు



తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఫార్మసీ విద్యార్థులు గుండిమెడ గ్రామంలో నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ అధికారి ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుండిమెడ గ్రామంలో మొక్కలు నాటామని తెలిపారు. అనంతరం విద్యార్థులందరూ ప్రతిజ్ఞ చేశారు.

దేవస్థానం అభివృద్ధికి ఎమ్మెల్యే విరాళం



తాడేపల్లిరూరల్: చిర్రావూరులోని నాంచారమ్మ అమ్మవారి దేవస్థానం పునరుద్ధరణ నిమిత్తం మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే అందించిన నగదును వైఎస్సార్ సీపీ చిర్రావూరు పార్టీ అధ్యక్షులు మేకల సాంబశివరావు ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్కే గ్రామంలో పర్యటించినప్పుడు స్థానికులు అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని కోరగా, స్పందించిన ఆర్కే రూ.50 వేల విరాళాన్ని పంపారని వెల్లడించారు.

వైఎస్సార్ బీమా అందజేత



మేడికొండూరు: యలవర్తిపాడులో ఈనెల 6న షేక్ అజీమ్ అనారోగ్య సమస్యలతో మృతిచెందడంతో అతడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష పరిహారం అందనుంది. తొలుత మట్టి ఖర్చుల నిమిత్తం రూ.పదివేలను అతడి కుటుంబ సభ్యులకు సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ చావపాటి మస్తాన్‌వలి అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కావడి రథోత్సవం

పాత గుంటూరు: కొరిటెపాడు శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర భక్త జన సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి 47వ భరణి, కృత్తిక కావడి రథోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు కొరిటెపాడులో ప్రారంభమై అరండల్‌పేట శ్రీ గంగా మీనాక్షీ సమేత సోమసుందర స్వామి దేవస్థానం వరకు వైభవంగా సాగింది. స్వామికి ప్రత్యేక అలంకరణ, నైవేద్యాలు, తీర్థ ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం దేవతా వేషధారణలతో కళాకారుల నృత్యాలు, వాయిద్యాలతో కావడి రథోత్సవం అరండల్ పేటలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధానం వరకు వైభవంగా సాగింది. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను సమితి సభ్యులు మేలపుడి కరుణానిధి, శివప్రసాద్, మురళీ కృష్ణ, కస్తూరి శివకుమార్ పర్యవేక్షించారు.

కన్నుల పండువగా శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

పాత గుంటూరు: మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు శివకుమారశర్మ, చంద్రశేఖరశర్మ మంత్రార్థాలను వివరిస్తూ భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. విశేష హారతి, మంత్ర పుష్పం అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు గుంటూరు వేమారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

‘భూ రక్ష’ రక్షితః

- 125 ఏళ్ల భూ రికార్డులకు స్వస్తి
- పత్రాల డిజిటలైజేషన్‌తో భద్రం
- వివాదాలకు శాశ్వత పరిష్కారం
- జిల్లాలోనే తొలిసారిగా చింతలపూడిలో నివాస స్థలాలకూ శాశ్వత భూహక్కు పత్రాలు
- మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



జగనన్న భూహక్కు-భూ రక్ష హక్కుపత్రాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్: జగనన్న భూ రక్ష–భూహక్కు పథకం వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని, ప్రజలకు రక్షగా ఉంటుందని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. చింతలపూడిలో నివాస భూముల సర్వే పూర్తి కావడంతో అర్హులకు క్యూఆర్ కోడ్‌తో కూడిన ఇంటి స్థల పత్రాలను ఎమ్మెల్యే ఆర్కేతోపాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ 125 ఏళ్ల నాటి రికార్డులను ప్రభుత్వం భూ రక్ష పథకం ద్వారా ఆధునికీకరించి డిజిటలైజ్ చేస్తోందని పేర్కొన్నారు. దీనిలోభాగంగా జరుగుతున్న రీ సర్వే దిగ్విజయంగా సాగుతోందని వెల్లడించారు. దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి అర్హులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో దుగ్గిరాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని తొలుత డీపీ అగ్రహారంలో పొలాల సర్వే పూర్తి చేశారని, అనంతరం చింతలపూడి గ్రామంలో వ్యవసాయ భూములతో పాటు నివాస స్థలాలకూ సర్వే పూర్తిచేసి జిల్లాలోనే తొలిసారిగా హక్కుపత్రాలు అందిస్తున్నారని వివరించారు. చింతలపూడిలో రోడ్ల సర్వే కూడా నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ గ్రామంలో 1962లో స్ట్రీట్ సర్వే నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు నిర్వహిస్తున్నట్టు వివరించారు. అనంతరం సర్వేను విజయవంతంగా పూర్తిచేసిన సర్వేయర్ బృందాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధికారులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో డీపీఓ కేశవరెడ్డి, దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, సర్వేయర్ మంజు, పంచాయతీ కార్యదర్శి మణికంఠం, వీఆర్‌వో జ్యోతి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యులు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

బాబు, లోకేష్ ఎక్కడ పోటీ చేస్తారో ప్రకటించాలి

మంగళగిరి: మాజీ సీఎం చంద్రబాబు కుప్పం నుంచి, లోకేష్ మంగళగిరి నుంచి పోటీ చేస్తామని ప్రకటించాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సవాల్ విసిరారు. బుధవారం ఎమ్మెల్యే ఆర్కే విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుత పాలనపై ప్రజలు ఆకర్షితులవుతున్నారని కొనియాడారు. దీంతో భయపడిన చంద్రబాబు, లోకేష్ తాము పోటీ చేసే స్థానాలను ఇప్పటివరకు ప్రకటించుకోలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా, లోకేష్ మూడు శాఖల మంత్రిగా ఉన్నప్పుడు మంగళగిరి నియోజకవర్గంలో ఏం అభివృద్ధి పనులు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంగళగిరి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.1500 కోట్ల నుంచి రూ.1600 కోట్ల సంక్షేమ పథకాల ఫలాలను పేదలకు అందించారని, సుమారు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తు చేశారు. 2014–19 మధ్య టీడీపీ చేసిందేమీ లేకపోయినా.. ఇప్పుడు చంద్రబాబు అది మరిచి వైనాట్ పులివెందుల అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు ఏమైనా మేలు చేశామని అనుకుని ఉంటే అప్పుడే ధైర్యంగా వైనాట్ పులివెందుల అనాల్సిందని, కానీ బాబు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు కాబట్టే అప్పుడు ఆ మాట అనలేకపోయారని ఆర్కే విమర్శించారు.

అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తిచేయాలి

మంగళగిరిలో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆరో ఏపీఎస్పీ క్యాంపు రోడ్డుకు ముఖద్వారంగా ఉన్న సర్దార్ వల్లభాయి పటేల్ ఆర్చి వద్ద రూ. 1.60 కోట్లతో జరుగుతున్న సీసీ రోడ్డు, ఆర్చి నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. ఆగస్టు 15 నాటికి సర్దార్ వల్లభాయి పటేల్ రోడ్డును ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం పెదవడ్లపూడి సెంటర్ వద్ద రూ.1.40 కోట్లతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. కార్పొరేషన్ పరిధి చినకాకాని వై జంక్షన్ నేతన్న సర్కిల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆగస్టు 15న 100 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు స్థలం మంగళగిరి ప్రజల ఆస్తి



పెనుమూలి జెడ్పీ పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

మంగళగిరి: నిడమర్రు రోడ్డులోని డంపింగ్ యార్డు స్థలం మంగళగిరి ప్రజల ఆస్తి అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) స్పష్టం చేశారు. బుధవారం ఆయన డంపింగ్ యార్డులో జరుగుతున్న మెరక పనులను నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ డంపింగ్‌యార్డు చెత్తాచెదారంతో నిండిపోతే స్థానిక ప్రజల వినతి మేరకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా శుభ్రం చేయించి మెరక తోలించామని పేర్కొన్నారు. యార్డు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రజావసరాలకు వినియోగించాలనే ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అయితే కొందరు 40 ఏళ్ల క్రితమే డంపింగ్‌యార్డు స్థలం తమదని వాదిస్తున్నారని, దీనికి దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలూ చూపిస్తున్నారని, యార్డును శుభ్రం చేసిన తర్వాత హైకోర్టులో కేసు వేశారని, ఇది అన్యాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏదేమైనా రూ.50 కోట్ల విలువైన డంపింగ్‌యార్డు స్థలాన్ని వదలబోమని, న్యాయపోరాటం చేసి ప్రజలకు దక్కేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలతో కోర్టుకెళ్లిన వారు చేసిన తప్పును తెలుసుకుని కేసు ఉపసంహరించుకుంటే అభినందిస్తామని, లేదంటే కార్పొరేషన్ ఎన్నికల అనంతరం డంపింగ్ యార్డును దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారితో పాటు వారికి సహకరించిన రిటైర్డు ఉద్యోగులపైనా చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు ఆకురాతి రాజేష్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎమ్మెల్యే సైకిళ్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలి జెడ్పీ పాఠశాలతోపాటు, మంచికలపూడి, దుగ్గిరాల పాఠశాలల్లో చదువుతున్న 21 మంది విద్యార్థినులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.1.50 లక్షల విలువైన సైకిళ్లను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ పెనమూలిలో పర్యటించినప్పుడు ఓ తల్లి తమ కూతురు పాఠశాలకు వెళ్లేందుకు సైకిల్ కావాలని కోరారని, దీంతో ఆ విద్యార్థినితోపాటు సైకిల్ కావాల్సిన పేద విద్యార్థులను గుర్తించాలని ఎంఈఓకు సూచించామని వివరించారు. ఎంఈఓ ఇచ్చిన జాబితా ప్రకారం.. పెనుమూలి ఎస్సీ కాలనీలో 16 మందికి, మంచికలపూడిలో ముగ్గురికి, దుగ్గిరాలలో ఇద్దరికి సైకిళ్లు అందించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా సైకిళ్లు అందుకున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ సల్మా, కొరిటాల సురేష్, యార్డ్ డైరెక్టర్ గరిక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: పెనుమాకలో అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి మట్టి ఖర్చుల నిమిత్తం మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) బుధవారం ఆర్థిక సహాయాన్ని ప్రకటించి వైఎస్సార్ సీపీ కన్వీనర్ దామేష్‌రెడ్డి చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దామేష్‌రెడ్డి మాట్లాడుతూ పెనుమాక గ్రామానికి చెందిన బొక్క నాగరాజు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ మట్టి ఖర్చుల నిమిత్తం 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క ప్రసన్నకుమార్ (నాని), పులి భుజంగరావు, అన్నూరి సుబ్బారావు, బషీర్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల నిరసన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని మండల కార్యాలయం వద్ద బుధవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్విట్ కార్పొరేట్ దోపిడీ దారులు - క్విట్ మోదీ - క్విట్ కార్పొరేట్ అగ్రికల్చర్ అనే డిమాండ్‌తో మండల కార్యాలయంలో ఎంపీడీవో కుసుమ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధరల పెరుగుదలను నియంత్రించాలని, చిన్న రైతులకు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, విద్యుత్ సవరణ బిల్లు 2022ను ఉపసంహరించుకోవాలని, మణిపూర్ మారణ కాండకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, మారణ హోమంలో నష్టపోయిన కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ సమితి సభ్యులు లోకం భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శివయ్య, అఖిల భారత కిసాన్ మహాసభ నాయకులు సిద్ధాబత్తుని ఆంజనేయులు, బలుసుపాటి ఏలేశ్వరరావు, నన్నెపాగ బుజ్జి, శీలం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి స్వామి ఆలయ హుండీ మాయం



ఆలయ తాళం పగలగొట్టిన దృశ్యం

మంగళగిరి: యర్రబాలెంలో మళ్లీ దొంగలు చెలరేగారు. స్థానిక భద్రావతీ సమేత భావనారుషి స్వామి ఆలయ హుండీని ఎత్తుకెళ్లడంతోపాటు పలు దుకాణాల్లో సరుకులను దోచుకెళ్లారు. సేకరించిన వివరాల ప్రకారం.. యర్రబాలెంలోని భావనారుషి ఆలయంలోకి మంగళవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి తలుపు తాళాలు పగులగొట్టి లోపల ఉన్న హుండీని ఎత్తుకెళ్లిపోయారు. బుధవారం ఉదయం ఆలయం ఊడ్చేందుకు వచ్చిన స్వీపర్ హనుమయ్య తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారాన్ని అందించారు. ఆలయ కోశాధికారి చిల్లపల్లి నాగేశ్వరరావు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. హుండీలో సుమారు రూ.5వేల వరకు నగదు ఉండొచ్చునని భావిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే బండివారి బజారుకు చెందిన గోపిశెట్టి రామయ్య నివాసంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ.10 వేల విలువైన రాగి బ్రాయిలర్‌ను దోచుకెళ్లారు. ఇక పొగాకు కంపెనీ సమీపంలోని ఓ కిరాణా దుకాణం, 60 లింకుల రోడ్డులోని మరో కిరాణా దుకాణం తలుపుల తాళాలు పగులగొట్టి నూనె ప్యాకెట్లను, కొన్ని రకాల సరుకులను దోచుకెళ్లినట్లు యజమానులు చెప్పారు. అంబటి నగర్‌లో దివ్య ఫ్యాన్సీ స్టోర్ తలుపు తాళాలు పగులగొట్టారు. అదే సమయంలో స్థానికులు కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. గ్రామంలో ఇటీవల కూడా దొంగలు పలు చోరీలకు పాల్పడిన విషయం తెలిసిందే.

ఎన్‌డీఎం వర్క్‌షాప్‌కు బోరుపాలెం వలంటీర్



తాడికొండ: తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామ వలంటీర్ దివ్వెల వెంకటేశ్వరరావు నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వర్క్‌షాప్‌కు హాజరయ్యేందుకు ఎంపికయ్యాడు. ఇతను గత నవంబర్‌లో బాపట్ల ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆపద మిత్ర శిక్షణ పొందాడు. ప్రకృతి విపత్తులు, వరదలు సంభవించిన సమయంలో ప్రజలకు ఎలాంటి సేవలు అందించాలి అనేదానిపై వలంటీర్ దివ్వెల వెంకటేశ్వరరావుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో వలంటీర్‌గా ఉత్తమ సేవలందించినందుకు వెంకటేశ్వరరావు గతంలో సేవా వజ్ర అవార్డు అందుకున్నాడు. ఇతని ఉత్తమ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం హర్యానాలో జరిగే నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ వర్క్‌షాప్‌కు ఎంపిక చేసింది. రాష్ట్రం నుంచి ఈ వర్క్‌షాప్‌నకు ముగ్గురిని ఎంపిక చేయగా వారిలో వెంకటేశ్వరరావు ఒకరు. హర్యానాలో ఈ నెల 11న జరిగే నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ వర్క్ షాపులో వెంకటేశ్వరరావు పాల్గొననున్నారు.

మిషన్ ఇంద్రధనస్సును సద్వినియోగం చేసుకోవాలి



ఫిరంగిపురం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎక్స్‌టర్నల్ మానిటర్ డబ్ల్యూహెచ్‌వో టీం (ఢిల్లీ) సభ్యుడు ప్రశాంత్ చెప్పారు. మండలంలోని నుదురుపాడు సబ్‌సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ వేస్తున్న తీరు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–5 ఏళ్ల లోపు చిన్నారులు, గర్భిణులకు ఇప్పటివరకు వ్యాక్సిన్ అందకుంటే మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా వారిని గుర్తించి ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. అనంతరం ఇంటింటికీ తిరిగి వ్యాక్సిన్ వేయించుకున్నవారి వివరాలు, వారికి వేస్తున్న వ్యాక్సిన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవం



తాడేపల్లిలో ఏకలవ్య, అంబేడ్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడా వెంకటేశ్వరరావు (పండు) స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏకలవ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆదివాసుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు మేకా వెంకటరామిరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, ఎస్సీ, బీసీ, మైనార్టీ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, బత్తుల దాసు, సయ్యద్ రసూల్, చిలుకోటి శ్రీనివాస మధు, మాజీ ఎంపీటీసీ జీలగ పెదగాలయ్య, గుత్తి అశోక్, సలాం, నాయుడు, రమేష్, కుంచాల శ్రీను, ఉయ్యాల శ్రీనివాసరావు, కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొండవీటి వాగులో తూటికాడ తొలగించాలని వినతి



సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ అలీమ్ బాషాకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్ : కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపుడెక్కలను తొలగించాలని కోరుతూ సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ అలీమ్ బాషాకు రైతు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ తాడికొండ మండలంలాం నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహానికి పూడికలు, తూటికాడ, గుర్రపుడెక్క అడ్డు పడి ఆటంకంగా మారిందని, పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, పల్లపు ప్రాంతాల్లోని గ్రామాలు జలమయమవుతున్నాయని, తక్షణమే కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని వెల్లడించారు. కార్యక్రమంలో కొండవీటి వాగు ముంపు ప్రాంత రైతులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు కొర్రపాడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడికొండూరు: కొర్రపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంపాల రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఫుట్‌బాల్ క్రీడాకారులు పది మంది బాలురు, పదిమంది బాలికలు జిల్లాస్థాయికి ఎంపికయ్యారని, వీరు పోటీల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా సబ్ జూనియర్ జట్టుకు ఎంపికైన వీరు ఈనెల 12 నుంచి 13 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ ఫుట్ బాల్ అసోసియేషన్ నిర్వహించే జోనల్ స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో గుంటూరు జిల్లా తరుపున పాల్గొననున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్



డాక్టర్ వైఎస్సార్, ఆదివాసీ ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యే ముస్తఫా, ఎమ్మెల్సీ రాజశేఖర్

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీ, పార్టీ రీజనల్ కో- ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వేడుకల్ని పార్టీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, పలువురు గిరిజన ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలకు సంక్షేమం, అభివృద్ధి అందజేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని తెలిపారు. విద్య, వైద్యాన్ని గిరిజనుల దరిచేరుస్తూ, సంస్కృతీ సంప్రదాయాల్ని కాపాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదివాసీలు, గిరిజనులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోతు హనుమంత్ నాయక్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు ముంతాజ్, బిక్కునాయక్, వెంకటసుబ్బయ్య, తోకల నరసింహారావు, గనిక ఝాన్సీ, పార్టీ నేతలు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపేటలో ఎస్పీ పర్యటన

గుంటూరు ఈస్ట్: జిల్లా ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ శ్రీనివాసరావుపేటలో అధికారులతో కలసి బుధవారం రాత్రి పర్యటించారు. 60 అడుగుల రోడ్డు, జెండా చెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో స్థానికుల్ని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని ఎస్‌హెచ్‌వో హైమారావును ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని ప్రధాన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రాత్రి విధులు నిర్వహించే సిబ్బంది, రక్షక్ వాహనాలతో పెట్రోలింగ్, నైట్‌బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బంది అనుమానాస్పదంగా పర్యటించే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రధాన కూడళ్లలో పటిష్ట నిఘా ఉంచాలని తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని సూచించారు. ఆయన ఎస్‌బీ సీఐ నరసింహారావు ఉన్నారు.



మహిళ ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మహిళ ఆత్మహత్యపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. శాంతీనగర్‌లోని అమృత టవర్స్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు భార్య సింధూర (35) అనారోగ్యంతో బాధపడుతోంది. మానసికంగా కుంగిపోయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.